మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి

అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

పుల్కల్, మే 19: తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓ పక్క వానలు పడుతున్నా ధాన్యాన్ని కొనే దిక్కులేదన్నారు. కళ్లెదుటే ధాన్యం తడిసిపోతుంటే దిక్కుతోచని స్థితిలో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతి రోజూ కేంద్రం నుంచి నాలుగు లారీల చొప్పున పంపించాం.. మరి ఇప్పుడు ఎందుకు సాధ్యం కావటం లేదో ప్రభుత్వం రైతులకు సమాధానం చెప్పాలన్నారు. పదిహేను రోజుల నుంచి నా వడ్లు కాంటకు పెడుతలేరని రైతు నర్సింహులు మాజీ ఎమ్మెల్యేతో మొర పెట్టుకున్నాడు. సీఎం రేవంత్ రెడ్డి రూ.500 బోనస్ ఇస్తామన్న మాట అటుంచి ముందైతే తడిసి పోతున్న ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అక్కడి నుంచి మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర టిఫిన్స్ హోటల్‌లో మామూలు వ్యక్తిలా కార్యకర్తలతో కలిసి కాఫీ తాగారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల విజయ్‌కుమార్, ఎంపీటీసీ శ్రీనివాస్ చారి, పీఏసీఎస్ డైరెక్టర్ మహేశ్‌బాబు, మాజీ సర్పంచ్, న్యాయవాది మఠం సిద్ధయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు లోకేష్, ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ చారి, నాయకులు నర్సింలు, మాణిక్‌రెడ్డి, రాజారాం తదితరులు ఉన్నారు.

తాలెల్మలో తాగునీటి కష్టాలు

అందోల్, మే 19: మండల పరిధిలోని తాలెల్మ గ్రామంలో ప్రజలు తాగునీటికోసం తండ్లాడుతున్నారు. మిషన్‌భగీరథ నీళ్లు సక్రమంగా రాకపోవడం, పంచాయతీ సైతం నీటిని సరఫరా చేయకపోవడంతో నీటి కష్టాలు ఎక్కువైపోయాయి. దీంతో బిందెలు పట్టుకొని వ్యవసాయ పొలాల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఆదివారం పలు కాలనీలకు ట్యాంకర్ ద్వారా నీటిని అందించేందుకు సిద్ధమైన అధికారులు ట్యాంకర్లో నీటిని తీసుకొని వెళ్లగా కాలనీవాసులు ఒక్కసారిగా నీళ్ల కోసం ఎగబడ్డారు. దీంతో తోపులాట జరగడంతోపాటు ఒకరిపై ఒకరు పెద్దగా అరుచుకుంటూ కేకలు వేసుకున్నారు. ఈ దృశ్యాలను చూసిన స్థానికులు కొంతమంది ఫోన్లలో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో అది వైరల్ అయ్యింది. పదేండ్లుగా నీళ్ల కోసం ఇలా రోడ్డెక్కిన సందర్భాలు లేవని, మళ్లీ ఇప్పుడూ నీళ్లకోసం కొట్లాడుతున్నామని స్థానికులు చర్చించుకున్నారు. గ్రామంలో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండడం.. వారు సమస్యలపై సరిగా దృష్టిపెట్టకపోవడంతో గ్రామంలో సమస్యలు పేరుకుపోతున్నాయని గ్రామస్తులు ఆరోపించారు.

నీళ్ల కోసం తాలెల్మ ప్రజల పాట్లు

ప్రిన్సిపాల్‌కు ఘన సన్మానం

ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పటాన్‌చెరు, మే 19: పటాన్‌చెరు మండలం పెద్ద కంజర్ల గ్రామంలోని గౌతమి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ వజ్జ దుర్గాప్రసాద్ ఉద్యోగ విరమణ అభినందన సభను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మల్లారెడ్డి ఫంక్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ దంపతులను సన్మానించారు. 1984లో గ్రామానికి వచ్చి పాఠశాలను స్థాపించడమే కాకుండా ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్ది వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి చేర్చిన ఆయన ఘనతను వక్తలు కొనియాడారు. తనపై ప్రేమను, అభిమానాన్ని చాటిన ప్రతి ఒక్కరికీ ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 10 జీవాలు మృతి

మద్దూరు(ధూళిమిట్ట), మే19: కుక్కల దాడిలో జీవాలు మృతి చెందిన సంఘటన మద్దూరు మండలంలోని లద్నూర్‌లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రాగుల బాల్‌నర్సయ్య అనే గొర్రెల కాపరి తన జీవాలను వ్యవసాయబావి వద్ద ఉన్న దొడ్డిలోకి తోలి రాత్రి ఇంటికి వచ్చాడు. ఈక్రమంలో వీధి కుక్కలు దొడ్డిలోకి ప్రవేశించి జీవాలపై దాడి చేయగా 10 జీవాలు మృత్యువాత పడ్డాయి

ఏసుక్రీస్తు శాంతి దేవుడు

కోహీర్, మే 19: మనుషుల్లో ఓ దేవుడిగా ఏసుక్రీస్తు జన్మించి మానవత్వపు పరిణామాలను విశ్వ వ్యాప్తం చేశాడని మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని మెథడిస్ట్ సెంట్రల్ చర్చి 94వ క్రైస్తవ ఉజ్జీవ సభలో ఆయన మాట్లాడారు. శాంతి, ప్రేమపూర్వక జీవన మార్గాన్ని ఉపదేశించాడన్నారు. ఈ సందర్భంగా చర్చి నిర్మాణ దాతలు దివంగత రెవరెండ్ జీబీ గార్డెన్, ఎల్సీ గార్డెన్ విగ్రహాలకు ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో సంజీవరావు, నవీన్‌కుమార్, సుధీర్‌కుమార్, ఎంజీ రాములు, హర్షద్, తదితరులు పాల్గొన్నారు.

జలం.. గరళం

తాగునీటిలో కలుషిత జలాలు మిక్స్! ■ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు బుట్టదాఖలు

ప్రజల ప్రాణాలతో చెలగాటం

కలగా మారిన రక్షిత తాగునీటి సరఫరా

- ఫార్మా పరిశ్రమల వ్యర్థాలతో పాడైన భూగర్భ జలాలు
- జలవనరుల్లో కలుస్తున్న ఫార్మా వ్యర్థాలు
- పెరుగుతున్న జనాభాకు సరిపోను నీళ్లు లేక ఇక్కట్లు
- పరోక్షంగా ఆర్వో ప్లాంట్లకు మేలు చేస్తున్న పంచాయతీ

ఇస్నాపూర్ గ్రామానికి తాగునీరు సరఫరా చేసే సంప్, సంప్‌లో మంజీర, బోరు నీటిని సమాంతరంగా కలుపుతున్న దృశ్యం

పటాన్‌చెరు, మే 19: తాగు నీటి సరఫరా పేరుతో కలుషిత జలాలు సరఫరా చేసి ప్రజల ప్రాణాలమీదకు తెస్తున్నారు. ఇస్నాపూర్ పంచాయతీ పరిధిలో తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీస్తున్నది. పాశమైలారం, ఇస్నాపూర్ ప్రాంతంలోని రసాయన, ఫార్మా, బల్క్‌డ్రగ్ పరిశ్రమల వ్యర్థ జలాలు ఇస్నాపూర్ పరిధిలో భూగర్భ జలాలను కలుషితం చేస్తున్నాయి. సుప్రీంకోర్టుతో పాటు గ్రీన్ ట్రిబ్యునల్ కలుషిత భూగర్భ జలాలున్న గ్రామాలకు ఉచితంగా సురక్షితమైన తాగునీటిని అందించాలని ఆదేశాలిచ్చాయి. అయితే ప్రస్తుతం ఇస్నాపూర్ పంచాయతీలో తాగునీటిలో సగం బోరు నీటిని కలిపి సరఫరా చేస్తున్నారు. పెరుగుతున్న జనాభాకు తగ్గట్లుగా తాగునీరు అందజేయలేని పరిస్థితిలో బోరు నీటిని కలుపుతున్నామని పంచాయతీ వర్గాలు చెబుతున్నాయి. వారంలో రెండు రోజులకు మించి ఈ నీటిని కూడా ఇవ్వడం లేదు. కొన్ని పంచాయతీల్లో వారంలో ఒక రోజు కూడా తాగునీరు అందడం లేదు.

పోరుబాట పట్టినా..

పటాన్‌చెరు, జిన్నారం, అమీన్‌పూర్, రామచంద్రాపురం మండలాల్లోని 18 గ్రామాల్లో భూగర్భ జలాలు కలుషితమయ్యాయని సుప్రీంకోర్టు ఇరవై ఏండ్ల క్రితం గుర్తించి ఆ గ్రామాలకు ఉచితంగా తాగునీటిని అందించాలని ఆదేశాలిచ్చింది. ఆ ఆదేశాల మేరకు జల మండలి ద్వారా కొన్ని గ్రామాలకు, సత్యసాయి ట్రస్ట్ ద్వారా మరికొన్ని గ్రామాలకు ఉచితంగా తాగునీటిని అందించారు. ఆ తర్వాత మిషన్ భగీరథ పథకం రావడంతో పటాన్‌చెరు మండలంలోని అన్ని గ్రామాలకు సురక్షితమైన తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మంజీరా, గోదావరి జలాలతో ఆయా గ్రామాల దాహం తీరుస్తున్నారు. ఇస్నాపూర్ పంచాయతీలో జనాభా 30వేలు దాటింది. రోజువారీగా తలసరి వంద లీటర్ల నీటిని అందజేయాలి. అంటే దాదాపు 30లక్షల లీటర్ల నీరు ఈ గ్రామానికి ఇవ్వాలి. ఇప్పుడు గ్రామానికి 16లక్షల లీటర్ల మిషన్ భగీరథ నీరు మాత్రమే సరఫరా అవుతున్నది. మరో 14లక్షల లీటర్ల నీరు అవసరం ఉంది. ఆ నీటిని భర్తీ చేసేందుకు బోరు నీటిని కలుపుతున్నారు.

తాటు నీటిని కొనుక్కుంటున్న ప్రజలు

ఇస్నాపూర్, పాశమైలారం, ముత్తంగి, రుద్రారం గ్రామాల్లో పాశమైలారం రసాయన, ఫార్మా, బల్క్‌డ్రగ్ పరిశ్రమల వ్యర్థాలు భూగర్భజలాల్లో కలుస్తున్నాయి. ఆయా గ్రామాల్లో 5,000 టీడీఎస్ నుంచి 1,000 టీడీఎస్ సాధారణంగా మారింది. తాగునీటికి ప్రభుత్వం, ఐఎస్ఐ, బీఐఎస్ సంస్థలు 200 టీడీఎస్‌లోపు ఉండాలని నిబంధనలు పెట్టాయి. 250 నుంచి 500 టీడీఎస్ వరకు నీటిని ఇంటి పనికి, బట్టలు ఉతికేందుకు, చెట్లకు నీరు పట్టేందుకు వాడాలని సూచించింది. 500 టీడీఎస్ దాటిన నీరు బట్టలుతికేందుకు కూడా పనికిరావని తెలిపింది. ఇంతటి కలుషితమైన బోరు నీటిని ప్రజలు తాగే నీటిలో కలిపి ప్రజారోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నారు. మంజీర, గోదావరి నీటి టీడీఎస్ 150-170 వరకు ఉండేలా చూస్తారు. ఇవి సురక్షితమైన తాగునీరు. గతంలో తాగునీటిని పరీక్షించేందుకు పంచాయతీల కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ప్రతి పంచాయతీకి తాగునీటి పరీక్ష కిట్‌లను కూడా ఇచ్చారు. ఇప్పుడు అవన్ని ఏ పంచాయతీలోనూ కనిపించడం లేదు. అయితే బోరు నీటిలో మంజీరా జలాలను కలిపి ఇవ్వడంతో ఈ నీరు సురక్షితమని నమ్మి ప్రజలు తాగుతున్నారు. భూగర్భ జలాలు కలుషితం కావడంతో మరికొందరు ఆర్వో ప్లాంట్ నుంచి నీళ్లను కొనుక్కొని దాహార్తి తీర్చుకుంటున్నారు.

మరో 16 లక్షల లీటర్లు అడిగాం

ఇస్నాపూర్ జనాభా 30 వేలు దాటుతున్నది. జనాభాకు తగ్గట్లు 30లక్షల లీటర్ల తాగునీరు నిత్యం అవసరమవుతుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఇస్నాపూర్‌కు తాగునీరు అందుతున్నది. ఇప్పుడున్న జనాభాకు సరిపోను ఓవర్ హెడ్ ట్యాంక్‌లు, సంప్‌లు కూడా నిర్మించాలని ప్రభుత్వానికి కోరుతున్నాం. పటాన్‌చెరు మండలంలో మరో కోటి లీటర్ల నీరు అదనంగా మంజూరు చేయాలని కోరాం. మా పరిధిలో గ్రామానికి నీటిని అందజేయడం వరకే. అనుమతి ఉన్నంత వరకు నీటిని పంపిణీ0 చేస్తాం.

- నాగేందర్, మిషన్ భగీరథ ఏఈ

'మిషన్ భగీరథ' సరిగా రావడం లేదు

మిషన్ భగీరథ ద్వారా సరఫరా అయ్యే మంజీర నీరు రోజూ రావడం లేదు. ప్రజలకు మంజీర నీటిని ఒక రోజు, బోరు నీటిని మరో రోజు వదులుతున్నాం. మంజీర నీటితో బోరు నీటిని కలపడం లేదు. కింది స్థాయిలో సిబ్బంది రెండు కలిపి సరఫరా చేస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. ఒక్కోసారి మూడు రోజుల పాటు మంజీర నీరు రావడం లేదు. జనాభాకు తగ్గట్టుగా నీటి వాటా పెంచాలని ఉన్నతాధికారులను కోరాం. గ్రామంలో నాలుగు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి తాగునీటి ఎద్దని అరికడతాం.

- మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి

ఎప్‌సెట్‌లో సత్తా చాటిన సాయికీర్తన

జిన్నారం, మే 19: జిన్నారం గ్రామానికి చెందిన వి.సాయికీర్తన ఎప్‌సెట్ అగ్రికల్చర్, మెడికల్ విభాగంలో సత్తా చాటింది. 3,340 ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతోనే తాను ఈ ర్యాంకు సాధించినట్లు తెలిపింది. నీట్‌లో మంచి మార్కులు సాధించి వైద్య వృత్తిలోకి రావాలన్నది తన కోరికని, వచ్చే నీట్ ఫలితాల్లో మంచి మార్కులు సాధిస్తానని ధీమా వ్యక్తం చేసింది. ఎప్‌సెట్‌లో తమ కూతురు మంచి ర్యాంకు సాధించడంపై తల్లిదండ్రులు దేవిశ్రీ, ఆనంద్ సంతోషం వ్యక్తం చేశారు.

భారీ వర్షాలతో తస్మాత్ జాగ్రత్త

రాయికోడ్, మే 19: ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకట్‌రెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రమైన రాయికోడ్ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ.. వానలతో రోడ్లపై వర్షపు నీరు చేరడం వల్ల వాహనాలు అదుపుతప్పి కిందపడే ప్రమాదం ఉన్నదని, వాహనాలను అతివేగంగా నడపవద్దన్నారు. వర్షం లో పిడుగులు పడే అవకాశం ఉంటుందని, అవసరం ఉంటేనే బయటకు వెళ్లాలన్నారు. మండల పరిధిలోని మంజీర నది పరీవాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ వైర్లు, స్తంభాలను ముట్టుకోవద్దని కోరారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం

విద్యార్థులను సన్మానించిన సభ్యులు

సంగారెడ్డి, మే 19: పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అల్లాదుర్గం సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆదివారం పట్టణంలోని అల్లాదుర్గం సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో సభ్యులు విద్యార్థులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వైద్యనాథ్, అసోసియేషన్ అధ్యక్షుడు రాంగారి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు సారా ప్రభాకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి, ఇంపాక్ట్ అధ్యక్షుడు కొంక రాజేశ్వర్, ఇంపాక్ట్ పీఆరో నందగోపాల్, ప్రతినిధులు జిన్న సంగారెడ్డి, హమ్మయ్య, ప్రేమ్‌చందర్, మల్లేశం, నవీన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

కల్హేర్, మే 19: బోరు మోటర్ పని చేయడం లేదని మరమ్మతు చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ తగిలి రైతు మృతి చెందిన ఘటన బాచేపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశం వివరాల ప్రకారం.. నిజాంపేట్ మండలం బాచేపల్లి గ్రామానికి చెందిన గంజాయి సాయిలు(44) తన పొలంలో బోరు మోటర్ పని చేయడం లేదని కొడుకు నవీన్‌ను వెంట తీసుకొని వెళ్లాడు. స్టార్టర్ డబ్బాలోకి విద్యుత్ సరఫరా ఉందో లేదో సర్వీస్ వైర్‌ను పరిశీలిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలింది. వెంటనే నారాయణఖేడ్ సర్కార్ దవాఖానకు తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య సాయవ్వ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్జాతీయ సదస్సుకు డాక్టర్ కృష్ణమూర్తి

సంగారెడ్డి కలెక్టరేట్, మే 19: అంతర్జాతీయ న్యూరో సదస్సులో ప్రసంగించేందుకు ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ టి.కృష్ణమూర్తికి ఆహ్వానం అందింది. ఐరోపా ఖండంలోని నెదర్లాండ్స్ రాజధాని అమ్‌స్టర్‌డమ్‌లో ఈ నెల 27 నుంచి 29 వరకు ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ న్యూరో సైన్స్ అండ్ బ్రెయిన్ డిజార్డర్స్ అనే అంశంపై సదస్సు జరుగనున్నది. ఈ సదస్సులో 'గ్రామీణ ప్రాంతాల్లో హటాత్తుగా, అనుకోని సందర్భాల్లో ఒక న్యూరో సర్జన్‌గా ఎదుర్కొనే అనుభవాలు' అనే అంశంపై ప్రసంగించేందుకు సంగారెడ్డిలోని హోప్ న్యూరో, కార్డియాక్ దవాఖాన అధినేత ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ కృష్ణమూర్తికి ఆహ్వానం వచ్చింది. ఈ అవకాశాన్ని దక్కించుకున్న డాక్టర్ కృష్ణమూర్తికి పట్టణంలో వివిధ దవాఖానల యజమానులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. డాక్టర్ కృష్ణమూర్తి ఇప్పటివరకు నాలుగు వేలకు పైగా మెదడు, వెన్నెముక ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యతో ఉన్నత స్థానాలకు చేరుకున్న రైతుబిడ్డ కృష్ణమూర్తికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

నేడు సబ్సిడీపై జనుము విత్తనాల పంపిణీ

న్యాల్‌కల్, మే 19: వానకాలం సీజన్‌కు సంబంధించి సబ్సిడీపై జనుము విత్తనాలను పంపిణీ చేస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి లావణ్య తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని సహకార సంఘంలో జనుము విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. 40 కిలోల జనుము బస్తా సబ్సిడీపై రూ.1,448లకు అందిస్తున్నట్లు చెప్పారు. అసక్తిగల రైతులు పట్టాపాసు బుక్కు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ వెంట తీసుకొని రావాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతులను ఆదుకోవాలి

సంగారెడ్డి, మే 19: జిల్లాలో కురుస్తున్న వర్షాలకు పంట నష్టపోయిన అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు ఆదివారం ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. వర్షాలతో కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చేతికొచ్చిన పంటను కాపాడుకోడానికి నానాపాట్లు పడుతున్నారన్నారు. నష్టపోయామని రైతులు మొరపెట్టుకున్నా అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. వర్షంతో పాటు గాలి దుమారానికి తీవ్రంగా పంటనష్టం జరిగిందని, అనేక చోట్ల ధాన్యం తడిసిందని వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గాలివానకు మామిడికాయలు రాలిపోవడంతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు.

280 క్వింటాళ్ల బియ్యం సీజ్

చిరాగ్‌పల్లి చెక్‌పోస్ట్ వద్ద పట్టుబడిన బియ్యం

కోహీర్, మే 19: గుంటూరు నుంచి గుజరాత్‌కు 280 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరి నిందితులపై కేసు నమోదు చేశామని జహీరాబాద్ డిప్యూటీ తహసీల్దార్ సాయి రవి ఆదివారం తెలిపారు. విజిలెన్స్ అధికారులతో కలిసి చిరాగ్‌పల్లి చెక్ పోస్ట్ వద్ద శనివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. గుంటూరు జిల్లా దాములముద్ది గ్రామం నుంచి 280 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుజరాత్‌కు అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈ బియ్యం విలువ సుమారు రూ.3,36,000 ఉంటుందని వెల్లడించారు. పీడీఎస్ బియ్యాన్ని భద్రపరిచేందుకు దిగ్వాల్ గోదాంకు తరలించామని చెప్పారు. అక్కడ తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయించేందుకు తరలిస్తున్నారన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడిన లారీ డ్రైవర్ గిరిధర్ భాయి, కమలపతి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కార్మికుల మదిలో మృత్యుంజయరావు

నివాళులర్పిస్తున్న కార్మికులు, పరిశ్రమ ప్రతినిధులు

గుమ్మడిదల, మే 19: కార్మికులు విధులు నిర్వహించడమే కాదు.. పరిశ్రమ వ్యవస్థాపకుడు తమను సొంతకుటుంబ సభ్యులుగా చూసుకున్నారని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆయన చూపిన మార్గంలో పయనించాలని కోరారు. మండలంలోని బొంతపల్లి పారిశ్రామికవాడలోని శ్యాంపిస్టాన్స్ అండ్ రిగ్స్ లిమిటేడ్ పరిశ్రమ వ్యవస్థాపకుడు, సీఎండీ సారెపల్లి దాశి మృత్యుంజయరావు(ఎస్‌డీఎంరావు) మొదటి వర్ధతిని పురస్కరించుకొని ఆదివారం ఆ పరిశ్రమకు చెందిన వందలాదిమంది కార్మికులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పరిశ్రమ జీఎం రమేశ్, ఏజీఎంలు సత్యం, నాగరాజు, పీఎంహెచ్‌ఆర్ వెంకటరాజు, ఏఐటీయూసీ, టీఎన్‌టీయూసీ, సీఐటీయూ కార్మిక సంఘాల నాయకుల, కార్మికులు నివాళులర్పించారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి శివకుమార్

తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ధ్రువపత్రాన్ని స్వీకరిస్తున్న లీఫ్ ఆర్టిస్ట్ శివకుమార్

నారాయణఖేడ్, మే 19: నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్ట్ గుండు శివకుమార్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. రావి ఆకులపై సందర్భోచితంగా చిత్రాలు వేస్తూ లీఫ్ ఆర్టిస్ట్‌గా గురింపు పొందాడు. ఇప్పటివరకు 1,111 చిత్రాలు వేసినందుకు గాను ఈ అరుదైన ఘనత సాధించారు. తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అధ్యక్షుడు చింటపట్ల వెంకటచారి శివకుమార్ ప్రతిభను గుర్తించి ఆదివారం హైదరాబాద్‌లోని సౌత్ సెంట్రల్ రైల్వే ఇనిస్టిట్యూట్‌లో జరిగిన కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత, స్తపతి వేలు ఆనందచారి చేతుల మీదుగా శివకుమార్‌కు ధ్రువపత్రంతోపాటు జ్ఞాపిక, బ్యాడ్జి, మెడల్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గుండు శివకుమార్ మాట్లాడుతూ తనకు తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కడం సంతోషంగా ఉందన్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ



అమీన్‌పూర్: ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని సన్మానిస్తున్న అమీన్‌పూర్ బీఆర్ఎస్ నాయకులు

గుమ్మడిదల: ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

అమీన్‌పూర్, మే 19: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దంపతులకు అమీన్‌పూర్ మున్సిపల్ బీఆర్ఎస్ నాయకులు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు ఎమ్మెల్యేను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, కౌన్సిలర్లు బిజిలి రాజు, నాయకులు శేఖర్, మహిపాల్ రెడ్డి, సత్యనారాయణ గౌడ్, అనిల్ కుమార్, గోపాల్, జగదీశ్, బాల్ రెడ్డి పాల్గొన్నారు.

గుమ్మడిదలలో..

గుమ్మడిదల, మే 19: ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పెండ్లి రోజును పురస్కరించుకొని ఆదివారం బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎంపీపీ సద్దిప్రవీణావిజయభాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్, సంతోష్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, గౌరీశంకర్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహ్మద్‌హుస్సేన్ తదితరులు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.